ప్రజాశక్తి
శనివారం 15 నవంబర్ 2025
5
అనంతపురం



టీటీడీ విజిలెన్స్ మాజీ అధికారి అనుమానాస్పద మృతి

తాడిపత్రి సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన మృతదేహం లభ్యం
హత్య చేసి పడేసారన్న కుటుంబసభ్యులు
టీటీడీలో సంచలనంగా మారిన పరకామణి కేసులో మృతుడు ప్రధాన సాక్షి



సతీష్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - తాడిపత్రి రూరల్

తాడిపత్రి మండల పరిధిలోని కోమలిగ్రామం వద్ద రైల్వే ట్రాక్‌పై తిరుమలలో పనిచేసిన మాజీ విజిలెన్స్ అధికారి, సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ (52) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. రైల్వే పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం తెల్లవారుజామున కోమలి రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి రైల్వే ట్రాక్ పక్కన పడి ఉండటాన్ని చూసిన స్థానికులు రైల్వే అధికారులకు తెలియజేయడంతో రైల్వే జి ఆర్ పి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు గతంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో విజిలెన్స్ సీనియర్ అధికారిగా పనిచేసిన సతీష్ కుమార్‌గా అని గుర్తించారు. ప్రస్తుతం సతీష్ కుమార్ గుంతకల్ జి ఆర్ పి లో రిజర్వ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. మృతుడు టీటీడీలో సంచలనంగా మారిన పరకామణి కేసులో ప్రధాన సాక్షిగా ఉన్నాడని ఆ కేసు తారుమారు చేయడం కోసమే హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

హత్య చేసి ట్రాక్ పక్కన పడేశారు : బాధితులు

తన అన్నను హత్య చేసి ట్రాక్ పక్కన పడేశారని ఇది ముమ్మాటికి హత్యే అని మృతుడు సతీష్ కుమార్ తమ్ముడు హరి ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో టీటీడీలో పనిచేసే సమయంలో అక్కడి పరకామణి సేవలో జరిగిన దొంగతనం కేసులో సతీష్ కుమార్ ప్రధాన సాక్షిగా ఉన్నారన్నారు. ఈ ఏడాది నవంబర్ 6న టీటీడీలోని పద్మావతి గెస్ట్ హౌస్ నందు విచారణ చేశారని అదే కోణంలో మరొక మారు సిఐడి ఆధ్వర్యంలో విచారణకు రావాలని తెలిపారన్నారు. దీంతో సిఐడి విచారణకు హాజరయ్యేందుకు గురువారం రాత్రి వెళ్లే సమయంలో కేసును తారుమారు చేసేందుకు తన అన్నను హత్య చేసి ట్రైన్ కిందపడి ఆత్మహత్య గా చిత్రీకరించారని ఆరోపించారు. దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హరి తెలిపారు.సంఘటనాస్థలాన్ని ఐజి షిమోషీ, ఎస్పీ జగదీష్, రైల్వే పోలీసులు పరిశీలించారు.

సతీష్‌కుమార్ మృతిపై విచారణ జరపాలి : టిటిడి బోర్డు మెంబర్ ఎమ్మెస్ రాజు

మడకశిర టౌన్ : తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణి చోరీ కేసుపై ఫిర్యాదు చేసిన టీటీడీ మాజీ విజిలెన్స్ అధికారి సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతిపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని టీటీడీ పాలకమండలి సభ్యులు, మడకశిర శాసనసభ్యులు ఎంఎస్.రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. పరకామణి చోరీకి సంబంధించిన కీలక పాత్రధారులు, సూత్రధారులు ఈ కేసు నుండి బయటపడేందుకు కీలక సాక్షిగా ఉన్న సతీష్‌కుమార్‌ను హత్యచేసి, తాడిపత్రిలోని రైల్వే ట్రాక్ మృతదేహాన్ని పడేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవాలని కోరారు. పరకామణిలో హుండీ డబ్బులను చోరీ చేసిన రవికుమార్, అతని వెనుక ఉన్న భూమన కరుణాకరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి మరికొంత మంది సూత్రధారులు, పాత్రధారుల విషయాలపై ఆరా తీయాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. పరకామణి కేసు విచారణ చివరిదశకు వచ్చిన తరుణంలో టీటీడీలో తన వాంగ్మూలం ఇచ్చేందుకు బయలుదేరిన సతీష్‌కుమార్ తాడిపత్రి సమీపంలోని కోమలి రైల్వే ట్రాక్ పై శవమై తేలడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో జరిగిన దుర్మార్గాలకు సంబంధించిన సాక్షులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శవరాజకీయాలు వైసీపీ నాయకులకు వెన్నతోపెట్టిన విద్య అని విమర్శించారు.

సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

విఐపిలు రానున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత
మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు
సర్వాంగ సుందరంగా ముస్తాబైన పుట్టపర్తి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్య సాయి శతజయంతి ఉత్సవాలను సర్వం సిద్ధమైంది. ఉత్సవాలు సవ్యంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లపై పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పుట్టపర్తిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఐఅండ్ పిఆర్ తో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని, మొత్తం కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జిఒఎం) ను నియమించిందని తెలిపారు. వారు ఇప్పటికే సమీక్షించి అనేక కీలక సూచనలు అందజేశారని వివరించారు. పుట్టపర్తికి వచ్చే భక్తుల కోసం రైల్వే స్టేషన్ నుండి ప్రశాంతి నిలయం వరకు ఉచిత బస్సులు ఏర్పాటు చేసి రవాణా సేవలు అందిస్తున్నామన్నారు. అలాగే సమీప ప్రాంతాల నుండి దాదాపు 300 అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, యాత్రికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచనున్నామని కలెక్టర్ తెలిపారు. రైల్వే శాఖ ద్వారా 165 స్పెషల్ రైళ్లు నడపనున్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో యాత్రికులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. భోజన వసతులు, మెడికల్ క్యాంపులు, తాగునీటి ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాల్లో ప్రత్యేక ఫుడ్ కౌంటర్లు, అన్ని పార్కింగ్ ప్రాంతాల్లో రాత్రి వేళ అవసరమైన లైటింగ్ సదుపాయాలు వృద్ధులు, వికలాంగులకు మినీ బస్సుల ద్వారా ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పించామన్నారు. మున్సిపాలిటీల ఆధ్వర్యంలో 300 మంది శానిటేషన్ వర్కర్లు, సూపర్‌వైజర్లు నియమించి పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. ఈ నెల 19 నుండి 23 వరకు నిర్వహించనున్న సత్యసాయి శతజయంతి వేడుకలకు ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు సహా అనేక మంది ప్రముఖులు పుట్టపర్తి వచ్చే అవకాశముందని చెప్పారు. వారి రాకపోకల కోసం ప్రత్యేక మార్గాలు, ప్రత్యేక రవాణా సౌకర్యాలు సిద్ధం చేశామని తెలిపారు. పుట్టపర్తి మొత్తం ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు, భద్రత బలోపేతం చేసేందుకు 5 వేల మంది పోలీసులు షిఫ్టుల వారీగా విధుల్లో నియమించామని చెప్పారు. ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా వేగంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక యంత్రాంగం సిద్ధం ఉందన్నారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24/7 ప్రకారం పర్యవేక్షణ చేస్తారని, అదేవిధంగా పట్టణం చుట్టుప్రక్కల 250 నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. యాత్రికులు ఏదైనా సమాచారానికి లేదా సహాయానికి 1800 233 5598 నంబరుకు కాల్ చేసి సంప్రదించవచ్చు అన్నారు. అనంతరం ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ ను కలెక్టర్ సందర్శించి స్టేషన్ లోపల, వెలుపల ఏర్పాట్లను పరిశీలించారు. రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తికి రావడానికి ఉచిత బస్సులు ఏర్పాటు, అక్కడి ప్రదేశంలో వాహనాలు, కార్లు, బస్సుల పార్కింగ్, త్రాగు నీటి వసతి, ఉచిత వైద్య శిబిరం తదితరాలను పరిశీలించి, తీసుకోవాల్సిన మరిన్ని చర్యలపై సూచనలు జారీ చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రశాంతి నిలయం వరకు రహదారి ఇరువైపులా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించి, విధులలో ఉన్న సిబ్బంది నిర్వహిస్తున్న పనిని పరిశీలించి, తగు సూచనలు జారీ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం దాటాక శిల్పారామానికి వెళ్లే దారిలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు ఆర్టీసీ, మున్సిపల్, పంచాయతీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 7.20 కోట్ల వ్యయంతో విద్యుత్ వ్యవస్థ బలోపేతం

శ్రీసత్యసాయి బాబా జయంతి వేడుకల సందర్భంగా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ఎపిఎస్‌పిడిసిఎల్ నడుం బిగించింది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే పుట్టపర్తిలో విద్యుత్ వెలుగులను విరజిమ్మేందుకు విద్యుత్ శాఖ ముందస్తు ప్రణాళికతో మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసింది. జయంతి ఉత్సవాల సమయంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతుందని అంచనావేసిన ఎపిఎస్‌పిడిసిఎల్ అందుకనుగుణంగా విద్యుత్ సబ్-స్టేషన్, ట్రాన్స్ ఫార్మర్లు, లైన్ల వంటి విద్యుత్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. నిరంతరాయ విద్యుత్ సరఫరాను కొనసాగించేందుకు పవర్ బ్యాకప్ సౌకర్యాన్ని కూడా అందుబాటులో ఉంచింది. సరఫరాలో అంతరాయం తలెత్తితే సరఫరా పునరుద్ధరణ కోసం 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేసింది. పుట్టపర్తి సాధారణ విద్యుత్ వినియోగం 6 మెగావాట్లు ఉండగా గరిష్ట లోడ్ 8 మెగావాట్లుగా నమోదవుతోంది. అయితే వేడుకల సందర్భంగా వినియోగం 10 మెగావాట్లకు చేరుకుంటుందనే అంచనాతో అందుకు తగ్గట్టుగా శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు(ఎస్ఎస్-ఎస్‌సిటీ) కోసం ప్రత్యేకంగా వెంగలామచెరువు వద్ద 33/11 కెవి సబ్-స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. లోడ్ ను సమర్థవంతంగా భరించేందుకు వీలుగా సబ్-స్టేషన్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పుట్టపర్తిలో మందిరం ప్రాంగణంలో ఎపిఎస్‌పి డిసిఎల్ రూ.128.50 లక్షల వ్యయంతో 5 కిలోమీటర్ల మేర 34ఎస్క్యూఎంఎం స్థానంలో 55 ఎస్క్యూఎంఎం కండక్టర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో దెబ్బతిన్న 40 ఎబి స్విచ్ ల స్థానంలో కొత్త వాటిని అమర్చారు. అలాగే జర్మన్ హ్యాంగర్ వంటి తాత్కాలిక షెడ్లకోసం 100, 160 కెవిఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్ ఫార్మర్లను కూడా ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ విధులకు ఆటంకం ఏర్పడకుండా పోలీస్ కార్యాలయం వద్ద ట్రాన్స్ ఫార్మర్ సామర్థ్యాన్ని 100 కెవిఎ నుంచి 160 కెవిఎకి పెంచారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద 100 కెవిఏ ట్రాన్స్ ఫార్మర్, సందీప్ బెల్ వ్యూ లే-అవుట్, వెస్ట్ గేట్, ఇతర పోలీసు వసతి ప్రాంతాల్లో కూడా కొత్త ట్రాన్స్ ఫార్మర్లను, లైన్లను ఏర్పాటు చేశారు. పుట్టపర్తిలో పట్టణంలో విద్యుత్ మౌళిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు వీలుగా ఎపిఎస్ పిడిసిఎల్ రూ.1.07 కోట్ల వ్యయంతో అదనపు ట్రాన్స్ ఫార్మర్లను, ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం, తక్కువ ఎత్తులో వున్న ట్రాన్స్ ఫార్మర్ల దిమ్మెల ఎత్తును పెంచడం, విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేయడం, లైన్లను సరిచేయడం వంటి పనులను త్వరితగతిన పూర్తి చేశారు. ఇక పార్కింగ్ ప్రాంతాల్లో కూడా రూ.13.60 లక్షల వ్యయంతో విద్యుత్ సౌకర్యాలను మెరుగుపరిచారు. శ్రీసత్యసాయి బాబా జయంతి వేడుకల సందర్భంగా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ఎపిఎస్‌పిడిసిఎల్ తగిన చర్యలు తీసుకుందని ఆసంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఉత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో వుంచుకుని, నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరానే ధ్యేయంగా 150 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సిబ్బందిని నియమించడంతోపాటు 60 మంది కాంట్రాక్టు సిబ్బందిని సేవలకు అందుబాటులో వుంచామని వివరించారు.

17 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీసత్య సాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 23వరకు స్థానిక శిల్పారామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు వివిధ ప్రముఖ సంగీత నృత్య కళా సంస్థల ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. అలాగే స్థానిక శిల్పారామంలో ఈనెల 15 నుండి 25 వరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అఖిల భారత డ్వాక్రా బజార్- 2025 ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ కళాకారులు తయారు చేసిన చేనేత హస్త కళలు, ఆహార ఉత్పత్తుల ప్రదర్శనచ హస్తకళలు, గృహ అలంకరణలో చేనేత ఉత్పత్తులు డ్వాక్రా బజార్లో అమ్మకాల నిమిత్తం స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.ఉత్సవాల సందర్భంగా పట్టణంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు డిఎస్పి విజయ్ కుమార్ తెలిపారు



ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

వార్త రాసిన విలేకరిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు

ఆగని అధికారపార్టీ నాయకుల ఆగడాలు

ప్రజాశక్తి-అనంతపురం

హిందూపురం నియోజకవర్గంలోని చిలమత్తూరు మండలంలో నాసిరకం రోడ్డు నిర్మాణపు పనులు జరుగుతున్నాయని వార్త రాసినందుకు ప్రజాశక్తి విలేకరి శంకర్ పై ఎస్సీఎస్టీ కేసును అధికారపార్టీ నేతలు బనాయించారు. వాస్తవానికి వార్త రాసిన విలేకరి శంకర్‌పై నాగరాజు యాదవ్, ఆయన కుమారుడు హరిష్ యాదవ్‌లు దాడి చేశారు. ఈ దాడిలో శంకర్‌కు గాయాలయ్యాయి. దీనిపై ఈనెల 10వ తేదీన శంకర్ చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు చేసిన తరువాత నాగరాజు యాదవ్ కూడా తనపై శంకర్ దాడి చేసాడని ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇద్దరిపైనా కేసులు నమోదు చేశారు. ఇక అంతటితోనే ఆగకుండా ఈనెల 13వ తేదీన విలేకరి శంకర్‌పై ఏకంగా ఎస్సీ,ఎస్టీ అట్రిసిటి కేసును నమోదు చేశారు. ఘటన జరిగిన మూడు రోజుల తరువాత రోడ్డు పనులు చేస్తుంటే విలేకరి శంకర్ వచ్చి తనను బెదిరించి, కులంతో దూషించాడని దళిత సూర్యనారాయణ అనే వ్యక్తి చేత ఫిర్యాదు చేయించారు. దీనిపైనా పోలీసులు శంకర్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయడం గమనార్హం.

తప్పుడు కేసులు బనాయించడం సరైంది కాదు : ఎపిడబ్ల్యుజెఎఫ్

విలేకరి శంకర్ వార్త రాసాడనిఅధికారపార్టీ నేత నాగరాజు యాదవ్, ఆయన కుమారుడు హరిష్ యాదవ్ బెదిరించడమే కాకుండా దాడి చేసి తీవ్రం గాయపరిచారని పైగా అతడిపైనే తప్పుడు కేసులు బనాయించడం సరైంది కాదని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ.షఫివుల్లా పేర్కొన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణం కేసులను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.

జిజిహెచ్‌లో కార్మికుల తొలగింపు ఆపాలి



రిలేదీక్షల వద్ద మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ సర్వజనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్ల తొలగింపు చర్యలు ఉప సంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఆర్‌వి నాయుడు, నాగేంద్రకుమార్, సిటిజన్ ఫోరం జిల్లా కన్వీనర్ ఎజి.రాజమోహన్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో సర్వజనాసుపత్రి పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్లు శుక్రవారం స్థానిక సర్వజనాసుపత్రి ఎదుట రిలే దీక్షలు నిర్వహించారు. దీక్షలకు సిటిజన్ ఫోరం కన్వీనర్ రాజమోహన్, ఎపిఎంఆర్ఎస్‌యు నాయకులు చంద్రశేఖర్, మనోహర్ . బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు హరి హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ మారిన ప్రతిసారి కార్మికులతో కోట్లాది రూపాయలు కొల్లకొడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో కాంట్రాక్ట్ తెచ్చుకోవడం, ఇది వరకే పని చేస్తున్న కార్మికులను అక్రమ వేధింపులకు పాల్పడం, తొలగించడం, తిరిగి మరలా ఆ పోస్టులు డబ్బులకు ఇతరులకు అమ్ముకోవడం సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారిందన్నారు. కాంట్రాక్టర్ల దుర్మార్గపు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వీరిని ప్రభుత్వాలు ప్రోత్సహించడం సరికాదన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులను సూపర్‌వైజర్ల విధులుకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బకాయి ఈపీఎఫ్, ఇఎస్ఐ డబ్బులు కార్మికుల ఖాతాల్లోకి జమ చేయాలన్నారు. ప్రభుత్వానికి చెందిన ప్రతి శాఖల్లో 60 సంవత్సరాల వరకు ఏ ఒక్క కార్మికులను తొలగించకూడదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతుంటే కొత్తగా వచ్చిన పద్మావతి ఏజెన్సీ వారు మాత్రం కార్మికులను సూపర్‌వైజర్లను తొలగించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. తొలగింపులకు పాల్పడుతుంటే ఉపాధి కల్పనా శాఖ అధికారులు ప్రభుత్వానికి ఏమి నివేదిస్తున్నారో తెలియడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు , సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజా, మెడికల్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు మనోహర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, నల్లమ్మ, రామాంజి, శివ, నగేష్, రేఖ, ప్రమీల, బి.సరోజ, కాసింబి, లక్ష్మీదేవి, రత్నమ్మ, ధనలక్ష్మి, పుష్పవతి, బండి నాగలక్ష్మి, జి.ఎల్లమ్మ, భాను శేఖర, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాల ఆవిష్కరణలో నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20 కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.ప్రసాద్, టి.రామాంజినేయులు తెలిపారు. ధర్నాకు సంబందించిన కరపత్రాలను ఆవిష్కరించిన నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభించి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం కార్మికులకు ఉన్న సంక్షేమ వెల్ఫేర్ బోర్డును నిలుపుదల చేసి తీరని అన్యాయం చేసిందన్నారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభిస్తామని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి కార్మికుల ఓట్లు కొల్లగొట్టారన్నారు. గెలిచిన తర్వాత కార్మికులను విస్మరించడం బాధాకరమన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో అనేక దఫాలుగా పోరాటాలు చేస్తున్న కూటమి ప్రభుత్వం కార్మికుల గురించి పట్టించుకోవటం లేదని విమర్శించారు. కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన ఒక శాతం సెస్సు రూ.3294 కోట్లు సంక్షేమ వెల్ఫేర్ బోర్డులో ఉన్నాయని అసెంబ్లీలో, శాసనమండలిలో కార్మిక శాఖ మంత్రి అధికారికంగా ప్రకటించారని తెలిపారు. వైసిపి, తెలుగుదేశం ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమ నిధి నుంచి ప్రభుత్వ పథకాలకు దారి మళ్లించి గతంలో రూ.1800 కోట్లు వినియోగించారన్నారు. ప్రస్తుతం కార్మిక సంక్షేమ బోర్డులో ఉన్న రూ.3294 కోట్లు కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టకుండా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు దారి మళ్లించాలన్న దుర్మార్గమైన ఆలోచనతో సంక్షేమ బోర్డును ప్రారంభించలేదని విమర్శించారు. సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభించాలని సెప్టెంబరు నెల 15వ తేదీన విజయవాడ లేబర్ కమిషనర్ ఆఫీస్ వద్ద వేలాది మందితో కార్మిక శాఖ కార్యాలయాన్ని ముట్టడించామన్నారు.కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని, సంక్షేమ బోర్డు ప్రారంభించాలని ఈ నెల 20న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు వెంకట్ నారాయణ, సాయి, లక్ష్మి, పకీరప్ప, వీరేష్, నరసింహులు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

20న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నేడు కథలు, కవిత్వం సంకలనాల ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా రూపొందించిన కథలు, కవిత్వం సంకలనాలను శనివారం సాయంత్రం 7 గంటలకు స్థానిక ఎన్జీవో హోంలో ఆవిష్కరించనున్నట్లు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి వి.సావిత్రి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, చంద్రిక శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కథలు, కవిత్వం సంకలనాల ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. 'ఎక్కడమ్మా నువ్వు లేనిది' అనే పుస్తకాన్ని స్నేహలత నర్సింగ్ హోం అధినేత్రి డాక్టర్ అరుణ, 'ఆధునిక మహిళ చరిత్రను తిరిగి రచిస్తుంది' అనే పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ఆవిష్కరిస్తారని తెలిపారు. పుస్తక సమీక్షకులుగా తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎస్.షమీఉల్లా, అరుణ, విశ్రాంత ప్రిన్సిపల్ తుమచర్ల రాజారాం వ్యవహరిస్తారని వివరించారు. కథా, కవిత్వ సంకలనాల ఆవిష్కరణకు మేధావులు, రచయితలు, కవులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయాలతో సమాజానికి ఉపయోగం

జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ



ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రస్తుత సమాజంలో గ్రంథాలయాలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ శుక్రవారం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జెసి ప్రారంభించారు. ముందుగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, డిప్యూటీ డిఇఒ మల్లారెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న, సహ గ్రంథాలయాధికారి డి.గోవిందు, కెవిఎస్ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, కవి కళాభూషణ్ రామలింగయ్య, సోషల్ వర్కర్ ఆషారాణి, రిటైర్డ్ టీచర్ పుట్లూరు శ్రీరాములు, రిటైర్డ్ డీఎస్పీ జె.హరి, మహేష్, సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్ రాజు, రామాంజినమ్మ, జిఎమ్.బాషా, కిరణ్, జీవన, బాలచంద్ర, ఇందిరమ్మ, ఉజ్జనేశ్వరి, శివమ్మ, శిరీష, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమా అధ్యక్షతన సాయంత్రం గ్రంథాలయ శాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, రిటైర్డ్ టీచర్ పుట్లూరు శ్రీరాములు, అంకే రామలింగయ్య, లలిత కళాపరిషత్ అధ్యక్షులు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు వివరాలను పరిశీలించుకోండి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-ఆత్మకూరు


సామాజిక తనిఖీ కోసం జిల్లావ్యాప్తంగా సచివాలయాల్లో ప్రదర్శిస్తున్న ఈ-పంట నమోదు వివరాలను రైతులు పరిశీలించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని ఆత్మకూరు.1 రైతు సేవాకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఇందులో భాగంగా ఖరీఫ్-2025కు చెందిన ఈ పంట నమోదు ముసాయిదా జాబితాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబితా ప్రదర్శన ఈనెల 17వతేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కావున రైతులు తమకు చెందిన ఈ పంట నమోదు వివరాలను సరి చూసుకొని ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి జి.రాము, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో ఖరీఫ్-2025కు సంబంధించిన వివరాలను పొందుపరిచామని, రైతులు సరిచూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు.

పుట్లూరు : మండలంలో ఖరీఫ్-2025లో రైతులు సాగు చేసిన పంటలను డిజిటల్ పంట నమోదు వివరాలను సరి చూసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి కాత్యాయిని శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. రైతులు సాగు చేసిన పంటలతోపాటు బీడు భూములను కూడా నమోదు చేశామన్నారు. పంట నమోదు వివరాలను మీ పరిధిలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అంగన్వాడీలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయొద్దు


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

ప్రజాశక్తి-గుంతకల్లు

అంగన్వాడీ సెంటర్లను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయొద్దని సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రేష్మా డిమాండ్ చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లోనే ప్రీస్కూల్ ఉండాలని సిఐటియు, అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లలో ప్రీ స్కూల్లో పిల్లలు తగ్గిపోతున్నారని కారణం చూపి అంగన్వాడీ సెంటర్లను విలీనం చేయాలని ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీ సెంటర్లలో ప్రీస్కూల్ బలోపేతం చేయాలంటే మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో నమోదయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు పెద్దక్క, సరోజ, హేమలత, సిఐటియు నాయకులు చౌక్కా సునీల్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూలో కల్తీపై వాస్తవాలను ప్రకటించాలి

ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

తిరుమల లడ్డూపై ఆధారాలేని ఆరోపణలు చేస్తూ.. లేని కల్తీ జరిగిందంటూ కూటమి ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారంపై ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉరవకొండ నియోజకవర్గంలోని కొనకొండ్ల గ్రామంలో ఉన్న ఎమ్మెల్సీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేవలం కక్షసాధింపు రాజకీయాలతోనే వైసీపీ నేతలపై బురద చల్లుతున్నారన్నారు. నెయ్యి నాణ్యతపై టిటిడి ఇఒ, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ తలో మాట మాట్లాడుతూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. లడ్డూ ప్రసాదంపై ఆధారాలుంటే నేరుగా సిట్ అధికారులే వివరాలను ఎందుకు భయటపెట్టడం ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో ఆలయాల్లో భక్తుల రక్షణలో విఫలమైన కూటమి ప్రభుత్వం కేవలం డైవర్షన్ పాలిటిక్స్ కోసమే ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. తిరుమలలో మునుపెన్నడూ లేనివిధంగా మాంసాహారం తినడం, మద్యం తాగడం, చెప్పులతో దర్శనానికి రావడం వంటి అపచారాలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. వాటి నుంచి భక్తుల దృష్టిని మరల్చడానికే తిరుమల లడ్డూ అంశాన్ని తెరపైకి తీసుకురావడం అలవాటుగా మారిందన్నారు. ప్రభుత్వం తన దగ్గర ఆధారాలుంటే చర్యలు తీసుకోవాలే తప్ప అనవసరమైన ఆరోపణలు చేయకూడదన్నారు.

అంకితభావంతో పని చేయాలి

అఖిల భారత సహకార వారోత్సవాల్లో వక్తలు


మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్

ప్రజాశక్తి-అనంతపురం

ఎడిసిసి బ్యాంకు సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని బ్యాంకు అధ్యక్షులు ముంటిమడుగు కేశవరెడ్డి సూచించారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని ఎడిసిసి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడిసిసి బ్యాంకు సిబ్బంది ప్రతి ఒక్కరూ పేద, బలహీన, బడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ సురేఖరాణి, డిజిఎంలు రామ్‌ప్రసాద్, సుఖదేవబాబు, విజయ చంద్రారెడ్డి, సహకార విద్యాధికారి మురళీమోహన్, బ్యాంకు ప్రధాన కార్యాలయ సిబ్బంది పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.

అలాగే అర్బన్ బ్యాంకులో ఛైర్మన్ జెఎల్ మురళీధర్ శుక్రవారం సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు వైస్‌ఛైర్మన్ మాగిశెట్టి చంద్రశేఖర్ డైరెక్టర్లు కృష్ణకుమార్, చింతా భాస్కర్, రామాంజినేయులు, రోళ్ల భాస్కర్, అనీల్‌నాయుడు, పుల్లప్ప, సిఇఒ భాస్కర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ డ్రిప్ కోసం రైతులను గుర్తించండి

అగ్రికల్చర్ జెడి ఉమామహేశ్వరమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

సబ్సిడీ డ్రిప్ పరికరాలు పొందేందుకు రైతులను గుర్తించి వివరాలు సేకరించాలని అగ్రికల్చర్ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఎపిఎంఐపి ఎపిడి ధనుంజయ సూచించారు. శుక్రవారం చెప్పారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ డ్రిప్ కంపెనీ ఏజెంట్లు, ఆర్‌ఎస్‌కె సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాయితీకి అర్హత లేని రైతుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రాథమిక, పూర్తిస్థాయి రిపోర్టులను తనిఖీలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐదెకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం రాయతీతో పరికరాలు ఇచ్చే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. జీఎస్టీ భారాన్ని ప్రభుత్వం తగ్గించినందున రైతులకు మరింత భారం తగ్గే అవకాశముందన్నారు. హెచ్‌ఓ కృష్ణతేజ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉద్యానశాఖ ద్వారా ఎంఐడిహెచ్ పథకం కింద కొత్త తోటల విస్తర్ణ కోసం నేరేడు, మామిడి, బొప్పాయి, ఫారంపాండ్లు, ప్యాకేహౌస్ సద్వినియోగాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు మాత్రమే వర్తిస్తాయన్నారు.

అభివృద్ధికి సహకరించండి

ఇన్‌ఛార్జి మున్సిపల్ ఛైర్మన్ తిమ్మప్ప


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఛైర్మన్ తిమ్మప్ప

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఇన్‌ఛార్జి ఛైర్మన్ తిమ్మప్ప విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకాలంగా పాలన పరమైన విషయంలో ఎన్నో సమస్యలు ఉండేవన్నారు. ఇప్పుడు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. అనంతరం సుమారు 21 అంశాల్లో అభివృద్ధి పనులు, అనుబంధ అజెండాలో మరో 11 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇదిలా ఉండగా వైసీపీ కౌన్సిలర్లు సమావేశానికి డుమ్మాకొట్టడం గమనార్హం. ఈ సమావేశంలో కౌన్సిలర్లు మహేశ్వరి, రాధారాణి, అనిత, అబ్రహాంతో పాటు కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన అధికారికి సన్మానం


కార్యక్రమంలో మాట్లాడుతున్న హరికృష్ణ బాలాజీ

కుందుర్పి : కుందుర్పి మండల పరిషత్ కార్యాలయంలో ఇఒఆర్‌డిగా విధులు నిర్వర్తిస్తున్న హరికృష్ణ బాలాజీ ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. హరికృష్ణ బాలాజీ ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో ఆయనకు పూలమాలలు, శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కమల నాగరాజు, వైస్ ఎంపిపి బీమారెడ్డి, సర్పంచులు మారుతేశ్వరి రామ్మూర్తి, మసాలా జగన్, గంగాధర్, ఓబన్న, విజయ్‌కుమార్, వెంకటేశులు, అతావుల్లా, వన్నూర్‌రెడ్డి, ఎంపిటిసి ఈరన్న, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

'బాలల వెలుగు పూలు' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



వివిధ వేషధారణల్లో విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

బాలల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి దినపత్రిక వెలువరిచిన వెలుగు పూలు ప్రత్యేక సంచికను స్థానిక బృహస్పతి పాఠశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. ముందుగా భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రయివేట్ పాఠశాలల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, బృహస్పతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పడెంట్ బి.రవిశంకర్ ప్రసాద్, బృహస్పత్తి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2005 -08 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు అందించిన సరస్వతీదేవి విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, విశ్రాంత ప్రిన్సిపాల్ రఘురామ మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : విప్ కాలవ


కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను టిడిపి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్తే రాబోయే ఎన్నికల్లో వైసిపికి డిపాజిట్లు కూడా రావని విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని 74 ఉడేగోళం మధ్యానేశ్వర స్వామి ఆలయం వద్ద పార్టీ పదవులు పొందిన వారు ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వం అడుగు అడుగడుగునా టిడిపి కార్యక్రమాలను అడ్డుకోవడంతో పాటు, కార్యకర్తలు, నాయకులను అనేక విధాలుగా వేధించిందన్నారు. కొత్తగా ఎన్నికైన వారు కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యుల్లా సమస్యలను పరిష్కరించుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ పార్టీ పదవుల రానివారికి రాబోవు రోజుల్లో మరిన్ని అవకాశాలు అధిష్టానం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతురెడ్డి, మండల కన్వీనర్ హనుమంతు, టిడిపి నాయకులు కాలువ భరత్, కాలువ సన్నన్న, రాజు, గ్యాస్ కృష్ణ, కడిపూడి మాబు, సదాశివరెడ్డి, వన్నారెడ్డి, గిరి మల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై అశ్రద్ధ చేయొద్దు...

ప్రముఖ కంటి వైద్యులు సారెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి



ప్రజాశక్తి - అనంతపురం

ప్రజలు గ్లకోమాపై నిర్లక్ష్యం చేస్తే చూపును కోల్పోయే ప్రమాదం ఉందని నగరంలోని జీసస్‌నగర్‌లో ఉన్న మదన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ కంట్లో నరాల ఒత్తిడి కారణంగా గ్లకోమా ప్రభావం పెరుగుతుందన్నారు. కంటి నరాలకు హాని కలిగితే దృష్టి క్రమంగా క్షీణిస్తుందన్నారు. గ్లకోమాను ప్రారంభ దశలో గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే అంధత్వానికి గురికాకుండా చూడవచ్చన్నారు. కళ్లు ఎర్రబడటం, కంటిలోపలి ఒత్తిడి కారణంగా వాపును కనిపించడం, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే గ్లకోమా లక్షణాలుగా గుర్తించాలన్నారు. గ్లకోమా వ్యాధి ప్రభావితుల్లో ప్రధానంగా కంటి చివర నుండి కంటి చూపు లోపిస్తూ ఉంటుందన్నారు. ఈవ్యాధిగ్రస్తుల్లో నొప్పి, ఇతర ఇబ్బందులు కనిపించకుండా దృష్టిలోపంతో సమస్య ప్రారంభమవుతుందన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయంతో సరైన నిర్ధారణ చేసుకుంటే గ్లకోమా నుంచి ఉపశమనం పొందవచ్చునున్నారు. ప్రస్తుతం ఆధునిక టెక్నాలజీ ద్వారా అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కంటి నరం దెబ్బ తినకముందు తీసుకునే వైద్య చికిత్స ద్వారా ఈ వ్యాధి నియంత్రణకు ప్రయత్నం చేయవచ్చన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


సమస్యలు వింటున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజాదర్బారు కార్యక్రమం నిర్వహించినట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమంలో మండల వ్యాప్తంగా సుమారు 106పైగా అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ, విద్యుత్, ఇంటి పట్టాలు, పారిశుధ్య సమస్యలపై అర్జీలు అధికంగా వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి అర్జీకి రసీదు ఇచ్చి పరిష్కరించే బాధ్యత తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇల్లు, స్థలం లేని లబ్ధిదారులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇకపోతే మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.16 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. మరో రూ.20కోట్ల ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలోనే నూతన పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా సచివాలయ సిబ్బందితో మండల అధికారులు సమన్వయంతో వ్యవహరిం సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కేశవనాయుడు, టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కుళ్లాయప్ప, జిసి బాబు, సింగిల్‌విండో ఛైర్మన్ మహేష్‌నాయుడు, నాయకులు ప్రతాప్‌చౌదరి, ఎర్నాగప్ప, తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ మమతాదేవి, ఇన్‌ఛార్జి ఇఒఆర్‌డి శ్యామల, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శేషారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీర్ జనార్ధన్, ఎంఇఒ నారపరెడ్డి, ఎఒ చెన్న వీరాస్వామి, సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, పంచాయతీరాజ్ ఇంజినీర్ రమణయ్య, ఎపిఒలు ఎర్రమ్మ, రమేష్ రామారావు, ఎపిఎం తిప్పమ్మ, సర్వేయర్ బ్రహ్మానంద, టిడిపి నాయకులు రాజన్న, జాఫర్‌వలి, ఓబులేసు, బాలనాగి నరేష్, నరసింహులు, శివనాయుడు, ప్రసాద్‌నాయుడు, ప్రకాష్‌నాయుడు, నరసింహులు, తిప్పన్న, లక్ష్మీనారాయణ, సాయినాథ్, సూరి, అంకన్న, జనసేన నాయకులు తుపాకుల భాస్కర్, గంజిగుంట రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సారూ...పింఛను ఇప్పించండి

ఎమ్మెల్యేకు వికలాంగుడి మొర


ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకుంటున్న వికలాంగుడు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

సారూ....నాకు రెండు కాళ్లు పని చేయడం లేదు, నాకు వచ్చే పింఛన్ మూడేళ్ల క్రితం తీసివేశారు.. మీరైనా తిరిగి ఇప్పించండి' అంటూ కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన వికలాంగుడు హనుమంతు కోరారు. శుక్రవారం స్థానిక ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్సులో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా బాధిత వికలాంగులు తన గోడును వెల్లబోసుకున్నాడు. ఈయనతో పాటు పలు గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి భూతగదాల సమస్యలు, ఇళ్లు, పింఛన్లు, వైద్య సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు బాధితులకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


అనంతపురంలో...


పుట్లూరులో...


రాయదుర్గంలో...


గుత్తిలో...

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మశ్రీ మాట్లాడుతూ కళాశాలలోని గ్రంథాలయంలో దాదాపుగా 1.18 లక్షల పుస్తకాలు ఉన్నాయన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర విభాగ అధిపతులు వెంకటస్వామి, శేఖర్, సుగప్ప, కళాశాల కేంద్ర గ్రంథాలయ అధికారి డాక్టర్ పి కేశవ, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : పుట్లూరు గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాల బాలికలు, లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గ్రంథాలయ అధికారి మధుసూదన ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు కొత్త రాయుడు, పాఠకులు పాల్గొన్నారు .

రాయదుర్గం : గుమ్మఘట్ట మండల కేంద్రంలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమైనట్లు లైబ్రేరియన్ నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యోగి, ఉపాధ్యాయులు బాషా, గ్రంథాలయ పాఠకులు నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి హెచ్.రామాంజనేయులు ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమములో ఎల్ఎం బాలుర పాఠశాల హెచ్ఎం ప్రేమావతమ్మ, ఎ.రవిచంద్ర, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జయానాయక్, టిసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్, పిజిటి నవీన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి, లైబ్రేరియన్ జయరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : స్థానిక మండల కేంద్రంలో గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎర్రిస్వామి, జెడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయులు వెంకట నారాయణ, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.


పామిడిలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


యల్లనూరు, బ్రహ్మసముద్రంలో మాట్లాడుతున్న కవ్తలు

ప్రజాగళాన్ని అణవేస్తామంటే సహించం

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి


సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజలు చేపట్టిన ఆందోళనలను అణచివేస్తామంటే సహించేది లేదని వైపిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తపోవనం సర్కిల్‌లో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ వైఎస్ జగన్ హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఏడు కళాశాలలను పూర్తి చేశారన్నారు. మిగిలిన 10 కళాశాలలను ప్రయివేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. అయితే పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రజాగళాన్ని అణగదొక్కాలని చూస్తే సహించేది లేదన్నారు. అప్రజాస్వామ్య పద్ధతిలో అధికార పార్టీకి దాసోహమైన పోలీసులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బెలుగుప్ప విద్యార్థి

బెలుగుప్ప : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు బెలుగుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భరత్ స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలపిఆరు. ఈ సందర్భంగా భరత్‌ను పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సరిత, స్కూల్ పాఠశాల కమిటీ ఛైర్మన్ రుద్రయ్య, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యల్లనూరు : స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సందర్భంగా శనివారం విద్యుత్ నిలిపి వేయనున్నట్లు ఎఇ పద్మనాభరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు, అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

అనంతపురం : స్థానిక ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో శుక్రవారం బి.యాలేరులో ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి గాలివానలు, కరెంట్ షాక్, పిడుగులు, అగ్నిమాపక ప్రమాదాలు, పాముకాటు, వరద వంటి వాటిని ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఎ.రేణుకమ్మ, ఉప సర్పంచు ఎ.ఎర్రిస్వామి, పంచాయతీ కార్యదర్శి మురళీధర్, హెచ్ఎం చెన్నారెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒలు జి.ఆనంద్‌బాబు, టి.సుదర్శన్‌రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు జెఎన్‌టియు విసి అభినందనలు

అనంతపురం : జెఎన్‌టియు పరిపాలన భవనంలోని ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో ఢిల్లీ ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపులో పాల్గొనేందుకు ఎంపికైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు శుక్రవారం అభినందించారు. అభినందించిన వారిలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒఎస్‌డి విసి ఎన్.దేవన్న, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శారద అభినందించారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

డి.హీరేహాళ్ : మండలంలోని నాగలాపురం-తిమ్మాలాపురం గ్రామం మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి టిడిపి మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. 2.4 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి నాబార్డు కింద రూ.1.60కోట్ల నిధులు మంజూరైననట్లు పిఆర్ డిఇ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, పల్లేపల్లి సదాశివరెడ్డి, బిజెపి నాయకులు మల్లేష్, గోపాల్, నాయకులు గోవిందు, ఎంపిడిఒ దాసానాయక్, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, కాంట్రాక్టర్ హనుమంతురెడ్డి, మాజీ సర్పంచు తిమ్మయ్య, తలారి నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా ఓటరు నమోదు ప్రక్రియ

రాయదుర్గం : ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రింగ్ ఆఫీసర్ ఎన్.రవిశంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహశీల్దార్, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

నార్పల సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా మహేష్‌నాయుడు

నార్పల : మండల సహకార పరపతి సంఘంగా అధ్యక్షునిగా మహేష్‌నాయుడుతోపాటు పాలకవర్గ సభ్యులుగా గంజికుంట రామకృష్ణ, కుళ్లాయిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కూటమి నాయకుల సహకారంతో మండల రైతులకు అందుబాటులో ఉంటూ సొసైటీ నుంచి అన్నిరకాల సేవలు సకాలంలో అందిస్తామన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఎపిఎంఎస్‌ఆర్‌యు మద్దతు

అనంతపురం కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని పెద్దాసుపత్రి ముందు పారిశుధ్య కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆంధ్రప్రదేశ్ మెడికల్, సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియర్ (ఎపిఎంఎస్‌ఆర్‌యు) మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, వర్కర్స్ సూపర్ వైజర్ల తొలగింపును ఉపసంహరించుకోవడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రెప్స్ నాయకులు మనోహర్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన

శింగనమల : తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శంకర్‌నాయక్ అదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని పెరవలి, ఉల్లికల్లు, కొరివిపల్లి తరిమెల గ్రామాల్లో మధుమేహంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ తేజస్విని, పిహెచ్ఎన్ గ్రేస్‌లత, మహిళా పర్యవేక్షకురాలు నాగమ్మ, సిహెచ్ఒ గంగాధర్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాసా కిట్లు పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో నాసా ప్రాజెక్ట్ నిర్వహణలో భాగమైన 14 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుక్రవారం నాసాకిట్లు పంపిణీ చేశారు. ప్రాథమిక స్థాయిలోనే ఇలాంటి ప్రోగ్రాం చేస్తున్న శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యాన్ని, నాసా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ డాన్స్ మాస్టర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఫిలిప్, డీన్ తిప్పారెడ్డి, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ముగ్గురిపై కేసు నమోదు

బెలుగుప్ప : భార్యపై అనుమానంతో భార్యను వేటకొడవలితో నరికిన కేసులో భర్త బోయ ఆంజనేయులుతోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సిఐ మహానంది తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బోయ ఆంజనయులు తన భార్య బోయ శాంతిపై అనుమానం పెంచుకుని గత శుక్రవారం రాత్రి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆంజనేయులుతోపాటు బోయ తిప్పేస్వామి, జయసింహను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివ, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగం అభివృద్ధితోనే దేశాభివృద్ధి

నెహ్రూ జయంతి కార్యక్రమంలో జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

సాంకేతిక రంగం అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి సాధ్యమని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. పండిత్ జవహర్‌లాల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జెఎన్‌టియు పరిపాలన భవనంలోని కళాశాల ఆవరణంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ సాంకేతిక రంగం అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని భావించిన దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆ దిశగా ప్రయత్నాలు చేశారన్నారు. పరిశోధనాత్మకంగా ఆలోచించినప్పుడే నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ చేసిన సేవలను ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి విసి ఎన్.దేవన్న, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, యూనివర్సిటీ డైరెక్టర్లు భానుమూర్తి, సత్యనారాయణ, వైశాలి ఘోర్పడే, నాగప్రసాద్ నాయుడు, సురేష్‌బాబు, ఈశ్వర్‌రెడ్డి, సుజాత, విబి.చిత్ర, బి.దుర్గాప్రసాద్, జివి.సుబ్బారెడ్డి, పద్మసువర్ణ, ప్రశాంతి, టి.నారాయణరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, శివకుమార్, శంకర్ శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్, ఓంప్రకాష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శారద, ఫైనాన్స్ ఆఫీసర్ వెంకటశివారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపాల్ కె.మాధవి, ఎం.రామశేఖర్‌రెడ్డి, అజిత, తదితరులు పాల్గొన్నారు.

జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ వెంకట నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ ముని నారాయణప్ప, కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణుడు, కన్వీనర్, స్కిమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణుడు, వివిధ విభాగాల అధ్యాపకులు జివి.రమణ, అనిత, సోమశేఖర్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని 3వరోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్ఐ డి.నాగేష్, పాఠశాల డైరెక్టర్లు ఎంపి.శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు జి.లావణ్య రామ్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : అనంతపురం రూరల్ ఇటుకులపల్లి సమీపంలో ఉన్న అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ అనంత రాముడు, కరస్పాండెంట్ రమేష్‌నాయుడు, సిఎఒ నరసింహారావు, ప్రధానోపాధ్యాయురాలు శాలిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని గ్రంథాలయంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ మల్లికార్జున, గ్రంథాలయం అధికారి బాబు, ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలీల, రామలింగాదేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలంలోని వీరన్నపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో జిల్లా ఉప విద్యాధికారి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఇందులోఉ భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు ఆర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని మిత్ర పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని దాదాపు 23 కిలోల కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా నేతాజీ ఎస్వీఎం పాఠశాలలతోపాటు ప్రభుత్వ బాలుల పాఠశాల, బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



జెఎన్‌టియులో నివాళులర్పిస్తున్న విసి, తదితరులు

శింగనమల : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ చల్లా లలితమ్మ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కేంద్రంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని సంఘమేష్ నగర్, గుత్తి రోడ్డులోని మాంటిస్సోరీ పాఠశాలల్లో శు క్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల కరస్పాండెంట్ సుర్యనారాయణరెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాళ్లు రమాదేవి, పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారెన్న, ఎంఇఒ హరికృష్ణ, పాఠశాల డైరెక్టర్లు నాగభూషణం, తిప్పేస్వామి, ఉపాధ్యాయులు సంధ్య, శైలజ, రషీద, నాగవేణి, మమత, ఎర్రిస్వామి, శిరీష, మాలశ్రీ, అంజలి, నవీన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

యాడికి : నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక విజన్ విద్యా సంస్థల్లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజన్ పాఠశాల ఉపాధ్యాయులు అమర్, కోటి, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి : ఎపి ఆదర్శ పాఠశాలలో జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.శ్వేత ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది విసి.గంగాధర కుమార్, కోర్టు టైపిస్ట్ ఎస్ సాదిక్ వలి, పారా లీగల్ వాలంటీర్లు ఎం.ఇస్మాయిల్, తన్నీరు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బేతాపల్లి గ్రామంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రంగనాథ్ అధ్యక్షతన బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబుళపతి, సులోచన, రవీంద్రనాథ్‌రెడ్డి, నిరుపమ, రామకృష్ణయ్య, విజయ కుమారి, నాగరాజు, సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : విద్యార్థులు దేశం కోసం పాటుపడాలని పద్మవాణి హైస్కూల్ కరస్పాండెంట్ నాగపీరయ్య పిలుపునిచ్చారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఉన్న పద్మవాణి హైస్కూల్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ మహబూబ్‌బాషా, హరినాథ్‌రెడ్డి, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నార్పలలో బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

90శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు

పుట్లూరు : పదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు అందజేయనున్నట్లు ఎపిడి ధనుంజయ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రంలో డ్రిప్పు కోసం రిజిస్ట్రేషన్లు, ప్రిలిమనరీ ఇన్స్‌ఫెక్షన్, ఫైనల్ ఇన్స్‌పెక్షన్, సర్వే నెంబర్లను ఎంపిక చేసుకునే విధానంపై మండలంలోని ఆర్ఎస్‌కె సిబ్బందికి అవగాహన కల్పించారు. పదెకరాల్లోపు ఉన్న రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం రాయితీతో డ్రిప్ పరికాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి నెట్టికంఠయ్య, ఉద్యాన విస్తరణ అధికారి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

నూతనంగా నిర్మించుకున్న భవనాన్ని విఆర్‌ఎలు సక్రమంగా వినియోగించుకోవాలని తహశీల్దార్ ఉషారాణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో విఆర్‌ఎల ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనాన్ని తహశీల్దార్ ప్రారంభించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి నిర్మించుకున్న భవనంలో ప్రభుత్వ కార్యాకలాపాలు కొనసాగించి ప్రనజలకు సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రామేశ్వరరెడ్డి, లక్ష్మీపతి, అంజి, అనిల్, రాజేష్, సుంకన్న, విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న, మండల సంఘం నాయకుడు నారాయణస్వామి, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, రంగన్న, రాముడు, కిరణ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

గుమ్మఘట్ట : దోమల నివారణకు చర్యలు చేపడితే డెంగీ, మలేరియా వంటి వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా మలేరియా అధికారి డి.ఓబులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆసుపత్రిని సందర్శించి ల్యాబ్ రికార్డులను పరిశీలిం చారు. దర్వాత వివిధ వ్యాధులపై సిబందితో సమీక్షించారు. అనంతరం కెజిబివి పాఠశాలలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అక్కడి నుంచి భూపసముద్రం సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ గిరిధర్‌రెడ్డి, వైద్యాధికారి రామ్‌కిషోర్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ షబానా, హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, ఎఎన్ఎం సావిత్రి, మలేరియా హెల్త్ అసిస్టెంట్లు ఎర్రిస్వామి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, రవిరాజు పాల్గొన్నారు.

టిడిపి మండల కన్వీనర్‌గా కాలవ సన్నన్న ప్రమాణ స్వీకారం

గుమ్మఘట్ట : తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్‌గా కాలవ సన్నన్న ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానన్నారు. తాను 2023 నుంచి గుమ్మఘట్ట మం డల క్లస్టర్ ఇన్‌ఛార్జిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిం చినం దున విప్ కాలవ శ్రీనివాసులు ఈ బాధ్యతలు అప్పగిచ్చారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గిరిమల్ల ప్ప, గుమ్మఘట్ట, వీరాపురం, బిటిపి సర్పంచులు విజయలక్ష్మి, నాగరాజు సదాశివ, రాజు, ఎస్సీ సెల్ చిన్ని కిష్టప్ప, తాళ్లకెర వెంకటేష్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

స్టోర్ డీలర్ల సంఘం ఎన్నిక

యాడికి : మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నూతన డీలర్ల సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మధురాజు, ఉపాధ్యక్షుడిగా కాకర్ల మహేష్, కార్యదర్శిగా నంద్యాల రామాంజనేయులు, కోశాధికారిగా రాంగోపాల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తిరంపురం నీలకంఠ, డీలర్లు నాగశేఖర్, నరసింహచౌదరి, చిట్టిబాబు, మాయ కుంట్ల నారాయణస్వామి జాఫర్ పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభ చూపాలి

ఎస్‌కెయు క్రీడల సెక్రటరీ జెస్సీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ జెస్సీ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్వీజీఎం డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లా డిగ్రీ కళాశాలల క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జెస్సీ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు. ఎంతో మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో రాణించి దేశానికి ఖ్యాతి తీసుకొస్తున్నారన్నారు. అనంతరం ఆయా జట్లకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్షలత, పీడీ జయరామప్ప, ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు బద్దేనాయక్, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీరాములు, ప్రశాంత్‌కుమార్, ప్రసాద్, అంజి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌కెయు క్రీడల సెక్రటరీ జెస్సీ

ప్రజాదర్బార్‌కు 17 అర్జీలు

అనంతపురం కలెక్టరేట్ : ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై 17 అర్జీలు వచ్చాయి. శుక్రవారం టిడిపి అర్బన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ధర్బార్‌లో పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మినరిసంహులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పిఎల్ఎన్.మూర్తి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ కొండన్నలు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

'అనంతగిరి'లో కార్తీక వనమహోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మన్నీల సమీపంలో ఉన్న అనంత రియాల్టీ, అనంతగిరి ఫార్మ్‌ల్యాండ్, రిసార్ట్‌లో వన మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధినేత కట్టా సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో తమ కస్టమర్లు, మిత్రులు, శ్రేయోభిలాషులకు శుభం కలగాలని ఆకాంక్షతో అనంతగిరి ఫార్మ్‌ల్యాండ్, రిసార్ట్‌లో వనమహోత్సవం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆదరణతో అనంత రియాల్టీ సంస్థ అనంతలో పెట్టుబడి అనంతమైన రాబడికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందన్నారు. కార్తీకమాసం సందర్భంగా పలు సాంస్కృతిక, వినోద భరీత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో లక్కీ డ్రా ద్వారా ఎంపికైన కస్టమర్లకు ప్రత్యేకమైన బహుమతులు అందిస్తున్నట్లు చెప్పారు.



ముస్తాబైన రిసార్ట్

దుర్వాసన రాకుండా చూస్తాం

రాయదుర్గం : పట్టణ పోలిమేరలో ఉన్న కంపోస్టు యార్డులో దుర్వాసన రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రాత్రి కంపోస్ట్ యార్డులో జెసిబితో చెత్తను మరోచోటికి తరలిస్తుండగా ఏర్పడిన దుర్వాసన చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించిన విషయం వాస్తవమే అన్నారు. అయితే కంపోస్టు యార్డు ఆవరణలో చెత్త వేసేందుకు స్థలం లేకపోవడం, చెత్తను తీసుకెళ్లే వాహనాలు ఆవరణలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నందున జెసిబితో చెత్తను ఎత్తివేయడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఇకముందు దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

17న ఛలో ఢిల్లీ

అనంతపురం కలెక్టరేట్ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై జరిగిన జరిగిన దాడిని నిరసిస్తూ ఈనెల 17న చేపడతున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.